# ఈ మార్గంలో.... దాహం తీరదు

‘‘స్టేషన్‌కి ఎవరూ రాలేదా?’’ అనుకున్నాడు ప్లాట్‌ఫామ్ మీద నిలబడి. ప్రసన్నకుమార్‌కి నిరుత్సాహం కలిగింది.

రావ్‌గారు, ఆయనతోబాటు లలిత, రాధ తప్పకుండా స్టేషన్‌కి వస్తారనుకున్నాడు. ఉత్సాహంతో ఎదురుచూశాడు. వాళ్ళకి కారుకూడా ఉండే ఉంటుంది. వాళ్ళగురించి, అంటే వాళ్ళ ఆర్థికస్థితిగతులగురించి అంత బాగా తెలియదుగానీ వాళ్ళని చూస్తుంటే బాగా అన్నీ ఉన్నవాళ్ళే అనిపిస్తుంది. సెలవలకి వాళ్ళ అత్తయ్య దగ్గిరికి వస్తుంటారు. వాళ్ళున్న పదిరోజులూ చాలా సరదాగా గడిచిపోతాయి. ఆ జ్ఞాపకాలు మనసులో ఉండి ఈ ప్రయాణాన్ని రకరకాలుగా ఊహించుకున్నాడు. ఇంకా ఆనందంగా గడపాలనీ... ఇంకా అనుకూలిస్తే లలితని... అమ్మకి చాదస్తం. వాళ్ళు పిల్లనిస్తామని అడగలేదు అంటుంది. తను వస్తుంటే హెచ్చరించింది కూడానూ....

‘ఈకాలపు పిల్లలకి తొందరెక్కువ. అందం చూసుకుంటే చాలా? అమ్మాయి కాస్త కనుముక్కుతీరు బాగుండి నవ్వుతూ మాట్లాడితే ప్రేమిస్తున్నామంటారు. పెళ్ళంటే ఎన్ని విషయాలు ఆలోచించుకోవాలి! వంశం, తండ్రి స్థితిగతులు, పిల్ల గుణగణాలు... కట్నం! డాక్టర్‌గారి అమ్మాయికి పదిహేనువేలు ఇస్తామన్నారు. ఎందుకివ్వరూ? అబ్బాయి ఇంజనీరు మరి. రేపు సుఖపడేది వాళ్ళ పిల్లేగా! ఆ పిల్లకిష్టమైతేనే నన్నైనా గుమ్మంలోకి రానిస్తుంది. లేకపోతే తల్లెవరో... కొడుకెవరో! అందుకే మనలో కలిసే పిల్లని వెతికి చేసుకోవాలి. జానకిగారి లలిత బాగానే ఉంటుంది. కానీ అబ్బో.... వాళ్ళు మరీ స్టైలుకి పోతారు. మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోండి అని మనని అడిగారా? మనకేం పట్టింది? మీ అమ్మాయిని చేసుకుంటామని అడగటానికి?

నువ్వు జాగ్రత్తగా ఉండు. డాక్టరుగారి అమ్మాయిని చూసుకుని తిన్నగా ఇంటికి రా. స్వంత ఆలోచనలు వెలగబెట్టకు'' అంది. ఆవిడ ఆలోచనా పద్ధతి అది!

వసంత పెళ్ళి విషయంలో కూడా అంతే!

అప్పుచేసి ఎక్కువ కట్నం ఇచ్చి 'ఇంజనీరు'కి ఇవ్వటానికే సిద్ధపడ్డారుకానీ శంకరానికి ఇవ్వటానికి ఒప్పుకోలేదు. అతడు లెక్చరరు. వాళ్ళు కట్నంకూడా అడగలేదు. కట్నం అడగని వాళ్ళని 'వద్దు' అనుకునే వాళ్ళుంటారా? ఉంటారు. ఈ ఆదర్శాలు అభిప్రాయాలూ ఉండేది కొందరికే. ఈ మధ్యతరగతి అంత విచిత్రమైన జాతి ఈభూమిమీద మరొకటి లేదు. కట్నాలని తిట్టిపోస్తారు... అవసరం లేనప్పుడు. ఇంట్లో ఒక పెళ్ళి జరుగుతున్నప్పుడు మాత్రం ఈ కట్నం ప్రముఖపాత్ర వహించి తీరుతుంది. ఆడబిడ్డలకి, అత్తగార్లకి లాంఛనాలు కావాలి. కూతురికి కట్నం ఇవ్వకపోతే తల్లి కూడా ఊరుకోదు. కట్నం తప్పకుండా ఉండి తీరుతుంది. కొడుకు పెళ్ళయితే కోడలు బాగా కట్నం తీసుకురావాలి. కూతురు పెళ్ళయితే వాళ్ళు తమ అంతస్తుకి పైగా ఉండాలనే కోరుకుంటారు. కూతురు సుఖపడాలని కోరుకోవటం సహజమేగానీ తమ స్థితిగతులూ మంచిచెడ్డలూ ఆలోచించుకోకుండా సుఖాలవైపు పరిగెత్తడానికి, ధనికుల జీవిత విధానంపట్ల ఆకర్షణ, వాళ్ళలా కనిపించటానికి తాపత్రయ పడటానికి అర్థమేమిటి? అట్లాగ అన్యమనస్కంగా ఉండి స్టేషన్ బయటికి వచ్చాడు ప్రసన్నకుమార్. ఆటో మాట్లాడుకుని రావుగారిల్లు చేరుకున్నాడు. ఆటో రోడ్లమీద పోతుంటే ఎన్నో హైక్లాసు లొకాలిటీలు, పూలచెట్లలో అందమైన బిల్డింగులన్నీ దాటిపోయాయి. ఆటో అక్కడెక్కడా ఆగలేదు. చివరికి ఒక చిన్న ఇంటి ముందు ఆగింది. 'ఈ ఇల్లు కాదేమో! వాళ్ళు ఇంత చిన్న ఇంట్లో ఉంటారా అని సంశయం కలిగింది. అతడు ఇంకా సంశయంలో ఉండగానే ఆటో ఆగిన శబ్దం విని కాబోలు ఒక అమ్మాయి బయటికి వచ్చింది. వెంటనే ముందుకి వచ్చి గేటు తీస్తూ ''స్టేషన్‌కి రాలేకపోయాం. ఏమనుకోకు. మొదటిసారి వచ్చావ్. నాన్నకి ఆఫీసు ఉంది. నేనైనా రావలసింది... ఐనా మగవాడివి రాలేకపోతావా అని...'' ఎయిర్‌బేగ్ అందుకుంటూ కొంటెగా నవ్వింది.

లలిత చీర కట్టుకుంది. ఒక్క జడ వేసుకుంది. ఐనా చక్కగా ఉంది.

అప్పటివరకూ ఉన్న సంశయాలూ, నిరుత్సాహం మాయమైపోయాయి.

లలిత మొహం చూస్తుంటే రిలీఫ్ కలిగింది. ఆటోవాడికి డబ్బులిచ్చి లలిత వెనక లోపలికి వెళ్ళాడు. జానకిగారు ఉందక్కడ.

''నీకోసం చూస్తున్నాం. ట్రైన్ లేటయినట్లుంది'' అందావిడ.

ఆవిడ మొహం ఎప్పుడూ ప్రసన్నంగా శీతలతరుచ్ఛాయలాగ ఉంటుంది.

''ఔను,'' అన్నాడు ఇంటిని పరిశీలించి చూస్తూ. రెండే గదులు కనిపిస్తున్నాయి.

''కూర్చో. ఆయన ఆఫీసుకి వెళ్ళారు. మీ అమ్మగారు రాసిన ఉత్తరం మొన్ననే అందింది. మాకు చాలా సంతోషం వేసింది. డాక్టర్‌గారు చాలా మంచివాళ్ళు. ఆయన చెప్పారు వాళ్ళకీ ఉత్తరం వచ్చిందని. నిన్ను తీసికెళ్ళటానికి, పెళ్ళిచూపులకి, సాయంత్రం వస్తామన్నారు'' అందావిడ.

లలిత కాఫీ తెచ్చి ఇచ్చింది.

''స్నానానికి వెళ్ళొచ్చు'' అంది.

''చాలా బాగుంది కాఫీ, రైలు దిగి రాగానే ఇంత మంచి కాఫీ...'' అన్నాడు నవ్వుతూ

''థాంక్స్'' అంది లలిత.

స్నానం చేసి వచ్చాడు. ఇల్లు పెద్దదేమీ కాదు. ఐనా వస్తువులన్నీ పొందికగా అమర్చబడి ఉన్నాయి. నీట్‌లుక్ ఉంది. రాధ, మురళి కాలేజీకి వెళ్ళారుట.

''మరి నువ్వు!'' అన్నాడు.

''నా చదువైపోయింది. ఇప్పుడు నేనే చదువు చెప్తున్నాను'' అంది లలిత నవ్వుతూ.

'ఆ అమ్మాయి... నేను చూడబోతున్న డాక్టరుగారి అమ్మాయి ఇంత చక్కగా ఉంటుందా!'' అనుకున్నాడు లలితని చూస్తూ.

కిటికీ పరదాలు సర్దుతుంటే లలిత జడ.... పొడుగ్గా.. కదులుతోంది.

జడ ఎంత అందమిస్తుంది ఆడపిల్లకి! అనిపించింది.

పరదాలు పక్కకి తీసింది లలిత. గదిలోకి సూర్యరశ్మి ప్రవేశించి వెచ్చగా బాగున్నట్లనిపించింది. లలిత చేతిలోకి నిట్టింగ్ తీసుకుంది.

''ఉత్తరం వచ్చినప్పటినుంచి రాధకి చాలా సరదాగా ఉంది. అది కూడా నీతో పెళ్ళిచూపులకి వస్తుందిట.''

''ఔను. చూసే వాళ్ళందరికీ సరదాగానే ఉంటుంది. నీక్కూడా సరదాగా ఉంటే నువ్వు కూడా రా!'' అన్నాడు.

''నాకు క్లాసు ఉంది. నీతో వస్తే నాకేం వస్తుంది! క్లాసుకి వెడితే ఐదురూపాయలు వస్తాయి'' అంది అతడిని చూస్తూ.

''గట్టిదానివే, లెక్కలు వేస్తున్నావ్, సంపాదించటం... నీకేమవసరం?'' అన్నాడు అతడికేసి నిశితంగా చూస్తూ.

''ఏమో, నాకు పెళ్ళి కాకపోవచ్చు. నేను సంపాదించుకోగలిగి ఉండాలి. డబ్బు చాలా అవసరం... కావలసినలా జీవించటానికి! పెళ్ళయితే అతడునాకు తిండి గుడ్డ ఇస్తే చాలదు. జీవితం పంచుకోవాలి. నాకోసం కష్టాన్ని వదులుకోవాలి!'' అనేసి లోపలికి వెళ్ళింది.

* * *

రాధ బెల్‌బాటమ్స్, కమీజ్ వేసుకుని చక్కగా ముస్తాబయింది. లక్ష్మి స్కూల్‌కి వెళ్ళింది. జానకిగారుకూడా సిద్ధంగా ఉంది.

''ప్రియ చూడటానికి బాగుంటుంది కానీ....'' అంటోంది రాధ.

తను చూడబోతున్న అమ్మాయిపేరు అది.

''రాధా! ఆరేసిన గుడ్డలు తీసి లోపలపెట్టు. తడిసిపోతాయి. వానవస్తే'' అంది జానకిగారు. రాధ పరిగెత్తుకుంటూ వెళ్ళింది.

కారు హార్న్ వినిపించింది. డాక్టరుగారు లోపలికి వచ్చారు.

జానకిగారు ప్రసన్నకుమార్‌ని ఆయనకి పరిచయం చేసింది.

''రావ్‌గారు లేరా?'' ఆన అడిగారు.

''డ్యూటీలో ఉన్నారు. మనం బయలుదేరుదాం'' అందావిడ.

ఎంబాసిడర్ కారు. సీట్లు కొత్తగా ఉన్నాయి. రోడ్డుమీద మెత్తగా పరిగెడుతోంది. డాక్టర్‌గారు తను జర్మనీ వెళ్ళినప్పటి సంగతులు. ఈమధ్య ఆయన ఇచ్చిన సలహా వలన కంపెనీకి ఎంత లాభం కలిగిందో చెప్తున్నారు. దారి దోవలో కనిపిస్తున్న బిల్డింగులూ, సినిమాహాళ్ళ పేర్లు చెప్పింది. వెళ్ళి వెళ్ళి కారు ఒక బంగళా ముందు ఆగింది. మాలి వచ్చి గేటు తీశాడు. కారు లోపలకి వెళ్ళింది. కారు దిగి అందరూ డ్రాయింగ్‌రూమ్‌లోకి వెళ్ళారు. అందరూ కూర్చున్నారు సోఫాల్లో. రజనీ రాధని తన పక్కన కూర్చోబెట్టుకుంది. ''పెళ్ళిచూపులు ఎలా జరుగుతాయో!'' అని ఇద్దరూ గుసగుసలాడుకుంటున్నారు. జానకిగారు వాళ్ళ చుట్టరికాలు వివరిస్తున్నారు.

పెళ్ళికూతురు ప్రియ బాగా ముస్తాబయి వచ్చి కూర్చుంది.

ప్రియతోబాటు పద్మకూడా వచ్చి కూచుంది పక్కనే.

''మాకు నలుగురమ్మాయిలు. ప్రియ రెండవది'' అన్నారు డాక్టర్‌గారు.

ప్రియ బాగుంది. కొంచెం బొద్దుగా ఉంది. తెల్లగానే ఉంది. అది సహజవర్ణమో, మేకప్ వలన వచ్చిన రంగో తెలియటం లేదు.

''లలిత రాలేదా?'' అని ప్రశ్నించింది జానకిగారిని ప్రియ.

''భానుమతిగారి స్కూల్లో క్లాసులు తీసుకుంటోందిగా. ఐనా తను రావలసిన పని లేదుగదా!'' అందావిడ.

ఫలహారాలు తెచ్చిపెట్టారు పనికుర్రవాడు. డాక్టర్‌గారి భార్య అందరికీ అందించింది. తర్వాత కాఫీలు వచ్చాయి.

''క్లబ్బులో మ్యూజిక్ కాంపిటీషన్‌కి మీరు రాలేదేం?'' అడిగింది డాక్టర్‌గారి భార్య.

''మేము మెంబర్స్ కాదుకదా!'' అంది జానకి.

''పేరుకి పోటీగానీ పక్షపాతం. జడ్జీల్లో శ్రీమతి సరణ్ ఉంది. బీహారీలంటే పక్షపాతం నీలకి ఇచ్చింది ప్రైజు''.

''మీ పద్మ కూడా పోటీలో పాడిందా?''

''పాడింది. అందరూ దానికి తప్పకుండా ప్రైజ్ వస్తుందనుకున్నారు. న్యాయంగా చూస్తే రావలసిందే....'' అంటూ ప్రసన్నవైపు తిరిగి

''మా పద్మ టాగోర్ సొసైటీలో పాటలు నేర్చుకుంటోంది. రజనీ డాన్స్. డాక్టర్‌గారికి లలితకళలంటే చాలా అభిమానం. ఆడపిల్లలకి చదువులేకపోయినా సరే! ఏదో ఒక ఆర్ట్ ఉండాలంటారు. వాళ్ళు చదువు... ఈ సంగీతం, డాన్స్‌లతో అలసిపోతున్నాం అని గొడవ. పద్మ నల్లబడిపోయింది.... ప్రాక్టీసులకి తిరిగి. డాన్స్‌డ్రామా చేశారు. చంపుకు తినేశారు'' అంది.

''ఔను. లలిత చెప్పింది. మాస్టర్ శంకర్ పెర్ఫెక్షనిస్టుట!.....

''లలిత కూడా సొసైటీకి వెడుతోందా?''

''లేదండీ. మేమెక్కడ చెప్పించగలం... కాలేజి తరపున కాంపిటిషన్‌కి వెళ్ళారు. వాళ్ళకి మొదటి బహుమతి వచ్చింది. లలితని మెచ్చుకున్నారు... ప్రత్యేకంగా.''

''డాక్టర్‌గారి భార్య మొహం నల్లబడినట్లు అయింది. ఆవిడలేచి లోపలికి వెళ్ళింది. ఈసారి ఫ్రూట్ సాలడ్ వచ్చింది. పద్మలేచి అందరికీ అందించింది.

''ప్రియ చేసింది. దానికి కొత్తరకాల వంటలు నేర్చుకోవటం ఇష్టం. కుకింగ్ క్లాసులు ఎటుండయింది. కేకులు, ఐస్‌క్రీములు పదిరకాలు నేర్పించింది మిసెస్ కంబట్టా. ఆవిడ ఎంత తెలివైందనుకున్నారూ! ఢిల్లీలో ఆవిడ అక్క దగ్గర నేర్చుకు వచ్చింది. వారానికి నాలుగు క్లాసులు చెప్తుంది. క్లాసుకి నలభైమంది వస్తారు. బాచీలుగా చేసి నేర్పిస్తుంది. వారానికి మూడువందలు సంపాదిస్తోంది. కడుపులో చల్ల కదలకుండా... హాయిగా.''

''బాగుంది. ఐస్‌క్రీమ్'' అన్నాడు ప్రసన్న.

అతడు వద్దంటున్నా వినకుండా ఇంకొంచెం వడ్డించింది రజనీ.

ప్రియ మధ్య మధ్య ప్రసన్నని చూస్తోంది. డాక్టర్‌గారు ప్రసన్న ఉద్యోగం గురించి అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు.

''మన ఆంధ్రాలో జీతాలు తక్కువ. ఇక్కడ ట్రై చెయ్యి. ఆరంభమే మంచి స్కేలు దొరుకుతుంది...'' అంటున్నారు డాక్టర్‌గారు.

ప్రసన్న ఆయన మాటలు వింటూనే ఇల్లు చూస్తున్నాడు. 'ఇంటిముందు పూల తోట ఉంది. మాలి ఉన్నాడు. ఆల్సేషియన్ కట్టేసి ఉంది. మంచి సోఫాసెట్టు. స్టీరియో మ్యూజిక్ సిస్టమ్... కార్పెట్, షోకేసులు, కర్టెన్లతో... ఖరీదైన వస్తువుతో నిండి ఉంది. వెనకగదిలో ఫ్రిజ్ కూడా ఉంది. ఈయన సంపాదన ఎంత ఉంటుందో! నలుగురు పిల్లలున్నారు...' అనుకుంటున్నాడు ప్రసన్న.

''మీకు పాటలు ఇష్టమా? ప్రియ పాడుతుంది'' అంది డాక్టర్‌గారి భార్య.

''పాడమనండి. అతడేమడుగుతాడు... మొహమాటపడుతున్నాడు'' అంది జానకిగారు.

తల్లి రెండుసార్లు చెప్పగా ప్రియ పాడింది.

''నా కనులు వెదకునది నీకోసమే''

నా మనసు కోరునది నీ స్నేహమే...''

ప్రేమగీతం!... పాడటం పూర్తి అయింది.

వెళ్ళివస్తామని లేచారు.

''ఏమోయ్, మా కంపెనీ చూస్తావా?'' అనడిగారు డాక్టర్‌గారు ప్రసన్నని.

అతడు సరేనన్నాడు. మర్నాటికి ఆ ప్రోగ్రామ్ నిశ్చయమైంది.

డాక్టర్‌గారు వాళ్ళని కారులో ఇంటిదగ్గర దింపి వెళ్ళారు.

* * *

రావ్‌గారు ముందుగదిలో కూర్చుని పేపరు చూస్తూ 'టీ' తాగుతున్నారు.

''రావోయ్ రా! నేను వచ్చేటప్పటికే నువ్వు రావటం, పెళ్ళిచూపులు... అన్నీ అయ్యాయి.'' అన్నారు ప్రసన్నని చూస్తూ.,

''లేకపోతే మీకోసం ఆగుతాడేమిటి?'' అంది జానకిగారు.

ఇంతలో లలిత వచ్చింది.

''మీరు 'టీ' తాగుతారా? అక్కడ ఐస్‌క్రీమ్ అవీ తిని వచ్చారుట!'' అంది నవ్వుతూ. ప్రసన్న వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. లలిత వేళాకోళం చేస్తోందేమో అనిపించింది. 'టీ' తాగాలనిపించలేదు. వద్దనటానికి సంశయంగా ఉంది.

''పోనీలే. కొంచెంసేపుండి తాగుదువుగాని'' అని లోపలికి వెళ్ళింది లలిత.

''ముందర ఇక్కడ డాక్టర్లకి పెద్దజీతాలు ఉండేవికావు. తర్వాత కంపెనీ ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు అన్నారు. అప్పటినించి డాక్టర్‌గారి సంపాదన బాగా పెరిగింది. అందరూ ఆయన్ని అదృష్టవంతుడు అంటారు'' అన్నారు రావ్‌గారు. అందరూ అంటారు అంటే.... అది ఆయన ఉద్దేశం కాదా!

డాక్టర్‌గారి ఇల్లూ మనుషులూ ఆడంబరంగానే ఉన్నారు. అది డబ్బుతో సహజంగా వస్తుంది. దాన్ని తప్పుపట్టవలసింది. అసహ్యించుకోవల్సింది ఏముంది!

''ఆయన ఇల్లు కట్టిస్తున్నారట కదా! రేపు అక్కడికి వెడదామన్నారు.'' అన్నాడు ప్రసన్న.

''ఇల్లు కట్టటం ఒక ఎక్స్‌పీరియన్స్. పెద్దదో చిన్నదో ప్రతివాడూ ఇల్లుకట్టి చూడాల్సిందే. డాక్టరుగారు ఇల్లు లక్షకి ఎస్టిమేట్ వేశారు. ఈ ఇల్లు మేము ఏడాది కిందట కొన్నాం. నలభైవేలయింది.... నిన్ను బోర్‌కొట్టిస్తున్నానేమో.

ఎక్కడికైనా వెడదామా... సినిమాకి...'' అన్నారు రావుగారు.

''నటరాజ్‌లో మంచి మూవీ ఉంది నాన్నా'' అంది రాధ ఉత్సాహంగా.

''అంటే రాజేష్‌ఖన్నా ఉన్నాడా? లలిత వస్తుందా?'' అనడిగారు.

లలిత గుమ్మం అవతలే ఉంది.

''నాకు పని ఉంది. అమ్మకి వంటలో సాయం చెయ్యాలి'' అంది.

''ఇవేల్టికి నేను చేసుకుంటాలే వెళ్ళు'' అంది జానకిగారు.

అందరూ తయారవుతున్నారు. ప్రసన్నకూడా మళ్ళీ మొహం కడుక్కొని డ్రెస్ మార్చుకున్నాడు. అడుగడుగునా ఆ ఇంటికీ ఈ ఇంటికీ తేడా కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఎన్నో సంశయాలు చుట్టుముట్టుతున్నాయి.

'ఐతే ఇది స్వంత ఇల్లన్నమాట. నలభైవేలు!

సినిమా అంటున్నారు. ఎంత దూరం వెళ్ళాలో! ఎట్లా వెళ్ళటం! టిక్కెట్లు నేను కొనటమా ఆయన కొంటారా? ఏ క్లాసుకి వెడతారో?'

లలిత చీరే కట్టుకుంది. బెల్స్ వేసుకోవటం మానేసినట్లుంది. నీలంచీర...

కళ్ళకి మస్కారా దిద్దుకుంది. ఇంకా అందంగా కనిపిస్తున్నాయి కళ్ళు. నీలంచీరలో ఇంకా తెల్లగా ఉన్నట్లు అనిపిస్తోంది. లలిత కళ్ళెత్తి చూస్తుంటే తన గుండె తలుపులు తడుతున్నట్లుగా ఉంది. మనసు తలుపు తెరచి ఆహ్వానించటానికి ఉబలాటపడుతోంది.

''సినిమా చూడటం చాలా ఉత్సాహకరంగా ఉంటుంది కదా!'' అంది లలిత.

''అన్ని సినిమాలు చూడలేం'' అన్నాడు ప్రసన్న.

''అది నిజమే కానీ సినిమాల్లో వెరైటీ అర్థం చేసుకోవాలి'' అంది.,

రాముా రోడ్డుమీద నిలబడి టాక్సీ ఆపాడు. అందరూ ఎక్కారు. హాలుదగ్గర ఆగగానే రావుగారు కౌంటర్ దగ్గరికి వెళ్ళి టిక్కెట్లు తీసుకున్నారు. సినిమా హాలు బాగుంది. దోవలో మెట్లమీద ఎర్ర తివాచీ పరిచి ఉంది. మెట్లెక్కి పైకి వెళ్ళారు.

'ఇంట్లో చాలా జాగ్రత్తగా ఉంటారు. చిన్నఇల్లు, పెద్ద సంపాదన లేకపోయినా లోటులేకుండా ఉంటారు. బయటికి వెడితే బాగానే ఖర్చుపెడతారన్నమాట!'' అనుకున్నాడు.

వెళ్ళి సీట్లలో కూర్చుంటుంటే డాక్టర్‌గారి ఫామిలీ లోపలికి వచ్చారు.

''హాయ్... అనుకోకుండా కలుసుకుంటున్నాం'' అంది ప్రియ లలిత దగ్గరికి వస్తూ.

''రాధా, నువ్వు రజనీ దగ్గర కూర్చో. ప్రియ నాదగ్గర కూర్చుంటుంది.''

సీట్లు మార్చుకుని సర్దుకున్నారు. లైట్లు ఆరాయి. న్యూస్‌రీల్ మొదలైంది.

''మీకు వీళ్ళు ఇంత బాగా తెలుసుననుకోలేదు'' అంది ప్రియ.

''బాగాకేముంది! మా అత్తయ్య పక్కింటివాళ్ళు. ఇప్పుడు నిన్ను చూడటానికి మా ఇంటికి వచ్చిన అతిథి'' అంది లలిత.

''నీ అభిప్రాయమేమిటి?'' అంది ప్రియ.

''నీకు నచ్చటం ముఖ్యం. నచ్చాడా?'' అంది లలిత నవ్వుతూ.

''బాగున్నాడులే. మరి మీరెందుకు ట్రై చెయ్యలేదూ!'' అంది ప్రియ.

''మీలాగ పదిహేనువేల కట్నం ఇవ్వలేము కదూ'' అంది లలిత నవ్వుతూనే.

ఇవ్వలేము అంటూనే ఆ కళ్ళలో ఆ మెరుపు ఎందుకో అర్థం కాలేదు ప్రియకి.

లలితకంటె తను గొప్పది. గర్వంగా అనిపించింది ప్రియకి.

ఔను. అందం, తెలివి ఉంటే చాలదు. డబ్బు లేకపోతే లాభంలేదు.

మంచి మొగుడు రావాలంటే కట్నం బాగా ఇవ్వాలి. నాన్నగారు ఇవ్వగలరు.

ఇస్తారు. అసలతడు మా ఇంట్లోనే దిగితే సరిపోయేది....

ప్రియ చీకట్లోనే అతడివైపు ఆశనిండిన చూపులు చూసింది. ప్రసన్న ప్రియనే చూస్తున్నాడు. ప్రియకి అతడు తనని ఇష్టపడుతున్నాడని నమ్మకం కలిగింది. సినిమా అయిపోయేదాకా ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

ప్రసన్నకి ఆ అమ్మాయిలిద్దరూ ఏం మాట్లాడుకుంటున్నారో అని బాధగా ఉంది.

ఇంటర్వెల్లో డాక్టర్గారు అందరికీ ఫాంటా, కోక్లు తెప్పించారు.,

కోక్ తాగుతూ లలితనీ ప్రియనీ మార్చి మార్చి చూస్తున్నాడు ప్రసన్న.

* * *

డాక్టర్గారు పొద్దున్న వచ్చి ప్రసన్నని తీసుకెళ్ళారు. రామూ, రాధ స్కూలు ఎగ్గొట్టి వాళ్ళతో వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పటికి రెండు దాటింది.

''నా కనులు వెదకునది నీకోసమే.....

నా మనసు చేసినది నీధ్యానమే...

అవే చరణాలు మళ్ళీ మళ్ళీ పాడుతోంది లలిత... రాగంలో గమకాలు నింపుతూ. ఆ కంఠంలో ప్రేమ నిండినట్లుగా అనిపించింది మొదటిసారి. రెండవసారి కంఠం ఇంకా మార్దవమై భక్తి పలుకుతోంది.

రాధ ప్రసన్నకుమార్‌ని చూసి నవ్వుతూ -

''అక్క చాలా బాగా పాడుతుంది. కదూ! సొసైటీలో నాటకం వేశారు. అందులోది ఈపాట. కాలేజీలో ఎప్పుడూ అక్కకే ప్రైజులు వస్తాయి, పాటల్లో, టి.టి.లో చదువులో... కూడా''.

మాటలు విని పాట ఆపింది లలిత. ప్రసన్న లోపలికి నడిచాడు.

పక్కగదిలో మంచంమీద పడుకుని ఉంది లలిత. దిళ్ళకి ఆనుకుని. అందమైన జడ భుజంమీద నించి జారి గుండెని దాటి మెలితిరిగి నడుం ఒంపులో కలిసిపోయింది.

రాధ గబగబా లోపలికి వెళ్ళింది.

''నిన్న ప్రియ కూడా నీ పాట పాడింది. ఏం బాగా పాడదు. పైగా ప్రైజ్ రాలేదని వాళ్ళమ్మకి కోపం'' అంది.

''ఉత్తి వాగుడుకాయ'' అని మొట్టికాయ వేసింది లలిత.

''పాట బాగా పాడతావే!'' అన్నాడు ప్రసన్న.

''నీకు పాటలు ఇష్టమా?'' అడిగింది లలిత.

''బాగా పాడితే ఇష్టమే''

''కొంతమందికి పాట కావాలి. మంచిపాట వినబడకపోతే వాళ్ళకి తోచదు. వెతుక్కుంటారు.''

''అంటే!''

''అంటేనా...'' లలిత కలకలా నవ్వింది. జవాబివ్వలేదు.

'అమ్మ హాస్పిటల్‌కి వెళ్ళింది. పక్కింటి వాళ్ళమ్మాయికి ఆపరేషనయింది. అమ్మ అక్కడ కూర్చుంటే ఆవిడ ఇంటికి వచ్చి స్నానం భోజనం చేసి వెడుతుంది. కనుక నీ ప్రయాణానికి కావలసిన వంటంతా నేను చెయ్యాలి. నీతో కబుర్లు చెప్పటానికి వీలవదు. వంట బాగా చెయ్యాలి. ఈసారి మా ఇంటికి రావుకదూ. డాక్టర్‌గారింటికి వెడతావు'' అంది.

''నేను ఒప్పుకుంటే కదా!'' అన్నాడు.

''ఎందుకొప్పుకోవూ!'' అని నవ్వింది లలిత. పరిహాసం చేస్తున్నట్లనిపిందించి.

నీకు పదిహేనువేలు కట్నం చాలు! ఆపిల్ల ఆడపిల్లయితే చాలు. ఇంకేమవసరం లేదు. ఎందుకొప్పుకోవూ? పదిహేనువేలు వదులుకుంటావా అని సవాలు చేస్తున్నట్లనిపించింది.



12

''నీకు జెలసీనా?'' అన్నాడు అప్రయత్నంగా. లలిత కళ్ళలోకి చూస్తూ
''జెలసీ ఉండవలసిందే. కానీ లేదు'' అంది నవ్వకుండా.

అని వంటింటివేపు వెళ్ళింది.

అతడికోసం పక్కవేసింది రాధ. దానిమీద పడుకున్నాడు.

డాక్టర్‌గారు ఆయన కట్టిస్తున్న ఇల్లు చూపించారు. ఇల్లు పెద్దదే. చాలా గదులున్నాయి. ఇంకా ఫ్లోరింగవలేదు. మొజాయిక్ చేయిస్తారుట. లక్షలోపల పూర్తిఅయితే చాలు. ఇల్లు కడితే బాగా ఖర్చుపెట్టి అన్ని సదుపాయాలతో కట్టాలి. లేకపోతే ఊరుకోవాలి. రావుగారు నలభైవేలలో ఇల్లు కొనేశారు. చౌకగా వచ్చింది. ఐనా రావ్‌గారు మైజర్ అనే చెప్పాలి'' అన్నారు.

లక్ష పెట్టి ఇల్లు... క్రిందటేడాది పెద్దకూతురికి కూడా కట్నం ఇచ్చి ఘనంగా పెళ్ళి చేశాడుట. ఇప్పుడు ప్రియ... ఎక్కడనుంచి వస్తుంది ఇంత డబ్బు! బాగా ఆస్తి ఉందా? అప్పులు ఉన్నాయా? ఏమో... నాకెందుకు అనుకున్నాడు.

అప్పుడు అతడు దాటవేస్తున్న ప్రశ్న పైకి వచ్చింది.

'లలితకి జెలసీ ఎందుకు లేదు?''

తనకి మంచి చదువుంది. ఉద్యోగం వుంది. హాండ్‌సమ్ అంటారు అందరూ. లలిత అందంగా ఉంటుంది. ప్రియకంటె తెలివైంది. ఐనా తను ప్రియని చేసుకుంటుంటే లలితకి జెలసీ ఎందుకు లేదు! ప్రియకి ప్రత్యేకతలు లేకపోయినా తండ్రి కట్నం ఇస్తాడు. అది అదృష్టం కాదా! లలితకి జెలసీ ఎందుకులేదు!...

లలిత ఆ గదిలోకి వచ్చింది పనిమీద.

''ఇంకా నీ వంట అవలేదా?'' అన్నాడు.

''నీకు మైసూర్‌పాక్ ఇష్టమా? హల్వా?'' అనడిగింది.

''నువ్వు కనుక్కోలేవా?'' అన్నాడు.

లలిత నవ్వింది.

''నీకు ఐస్‌క్రీమ్ ఇష్టం!'' అంది.

అతడు లేచి కూర్చుని

''సరే, నీకు జెలసీ ఎందుకు లేదో చెప్పు'' అన్నాడు.

''ఏమీ లేదు, సింపుల్. నువ్వు నన్ను చూడటానికి రాలేదుగా. ఆఫ్‌కోర్స్, అది నీ నిర్ణయంమీద ఆధారపడి ఉంటుంది. నువ్వు ప్రియని చేసుకోటానికి ఒప్పుకున్నావనుకో, నీ ఆలోచనావిధానమేమిటో నాకు తెలుసు. అటువంటి

మనిషి నాకు దొరకలేదని నేను బాధపడను. ఒకవేళ ప్రియని చూసుకోడానికి వచ్చినా లలితని ఇష్టపడి, కట్నం వదలుకుని పెళ్ళి చేసుకుంటావనుకో... ఆ వ్యక్తి ఎటువంటివాడై ఉంటాడో నాకు తెలుసు. అప్పుడు బాధపడటానికేముంది, సంతోషించటం తప్ప!''

ప్రసన్న గుండె వేగంగా కొట్టుకుంటోంది,

''ఐనా మీ అమ్మ ఇంట్లో లేనప్పుడు నేనిట్లాగ మాట్లాడకూడదేమో!'' అన్నాడు. ''దానికేం ఫరవాలేదు. అమ్మకి నాపనులు, మాటలన్నీ తెలుసు. ఒకరిని ఆకర్షించటానికి తంటాలు పడవలసిన అవసరం కూడా నాకు లేదు. నేను కట్నాలిచ్చి పెళ్ళి చేసుకోనుకనుక, ప్రియ కట్నం ఇచ్చి చేసుకుంటుంది కనక నాకు పోటీ కాదు. నేను వేరే మతానికి చెందినదాన్ని గనుక ప్రియని చూసి నాకు జెలసీ లేదు. నాకు బాధ లేదు'' అంది.

లలితని గుండెకి హత్తుకోవాలని అతడికి ఉవ్వెత్తుగా కోరిక కలిగింది.

కానీ అతడు అక్కడనించి లేవలేదు. లలిత అక్కడ ఉన్న పాత న్యూస్‌పేపర్ తీసి ''పిండి జల్లించాలి... మైసూర్‌పాక్‌కోసం...'' అని వెళ్ళిపోయింది.

అతడు రైల్లో వెడుతూ అదే ఆలోచించాడు.

లలిత తనకోసం బాధపడకపోవటం అతడికి బాధగా ఉంది.

తల్లి లలితని ఒంటరిగా వదిలి వెళ్ళటం, కట్నం లేకుండా తనని ఇష్టపడినవాడని... అని లలిత అనటం... ఇదంతా ప్లానేమో అని కూడా అనిపించింది.

లలిత అన్నివిధాలా ప్రియకంటె మెరుగు అని తెలుసు.

అతడి మనసు లలితని ఇష్టపడుతోంది. కోరుకుంటోంది.

''రావ్‌గారు నలభైవేలు పెట్టి ఇల్లు కట్టించకపోతే కట్నం ఇచ్చి లలితకి పెళ్ళి చెయ్యకూడదా! రావుగారే ఆ పదిహేనువేలూ ఇస్తే...'' అని కూడా అనుకున్నాడు.

ఐనా తల్లిదండ్రులు డాక్టర్‌గారి సంబంధం నిశ్చయిస్తామంటే అంగీకారం తెలిపాడు. ఎందుకు ఇట్లాగ జరిగింది?

నాకు అర్థం కాలేదనుకున్నాడు.

అర్థమైనా దాన్ని పాటించదలుచుకోలేదేమో.

ఈకాలం చాలామంది అంతే.

ప్రియ వలన అతడు సుఖపడలేదని, డాక్టర్‌గారికి ఊరినిండా అప్పులున్నాయని చెప్పటం కాదు ఈ కథ సారాంశం!

డాక్టర్‌గారివలన అతడికి పెద్ద ఉద్యోగం వచ్చి ఉండచ్చు, ప్రియ ఆడంబరాలు కోరి అతిగా ఖర్చుపెట్టి ఉండవచ్చు, పిల్లలు పుట్టాక లావుగా తయారై అసహ్యంగా మారి ఉండచ్చు. అవన్నీ సామాన్యమైన విషయాలు. గృహస్థుని సామాన్యుడిగా ఉంచే విషయాలు. అట్లాగ ఎంతోమంది బతికేస్తున్నారు. చెప్పేదేమిటంటే... ఇది యుగలక్షణమని! సుఖాలనీ, డబ్బు తెచ్చే హోదాని దర్పాన్ని కోరుకుంటూ మనిషి జీవితపు విలువల్ని దూరం చేసుకుంటున్నాడు. మానసికమైన ఔన్నత్యానికి ఆనందానికి దూరంగా వెళ్ళిపోతున్నాడు.

కానీ ఈ ఆకర్షణలు, పైపై మెరుగులు, ఎండమావులు, దాహం తీర్చవు.

ఈమార్గంలో... మనిషి దాహం తీరదు.

1975

* * * *